వాణిజ్య పంట.. వరద తంటా


అయోధ్యలంకలో కుళ్లిపోయిన తమలపాకు తోట


మధ్యస్థ లంకలో కుళ్లిన తోట వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతన్న

నష్టాల ఊబిలో రైతన్న

పెనుగొండ: అటు వర్షాలు ఇటు వరదలతో వాణజ్య పంటల రైతులు నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో రైతన్నలు లబోదిబో మంటున్నారు. ముఖ్యంగా పెనుగొండ, ఆచంట, యలమంచిలి మండలాల్లోని లంక భూముల్లో అత్యధిక శాతం రైతన్నలు వాణిజ్య పంటలైన కూరగాయ రకాలు వంకాయ, బెండ, దొండ, మునగ, ఆనబ, బీర, చిక్కుడు, అరటి, తమలపాకు, బొప్పాయి పండిస్తుంటారు. ఈ ఏడాది రెండు సార్లు వరద రావడంతో పాటు, నిత్యం వర్షాలు తాకిడి ఎక్కువగా ఉండడంతో ముఖ్యంగా కూరగాయల తోటలు పూర్తిగా కుళ్లిపోవడంతో రైతన్నలకు దిక్కు తోచడం లేదు. ఇదే పరిస్థితి తమలపాకు రైతన్నలకు ఏర్పడింది. పెనుగొండ 200 ఎకరాలు, ఆచంట మండలంలో దాదాపుగా 300 ఎకరాలు, యలమంచిలి మండలంలోని కనకాయలంక ఇతర లంకభూముల్లో సుమారు 100 ఎకరాల్లో వాణిజ్య పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.35 వేలు నుంచి రూ.50 వేలు వరకూ పెట్టుబడులు పెట్టడం పూర్తికావడంతో పంట చేతికి రాకుండానే వరద తాకిడికి మునిగిపోయాయి. రెండు మూడు రోజులు వరద నీటిలో ఉండిపోవడంతో కూరగాయల పాదులు కుళ్లిపోయాయి. తమల పాకుల తోటలకు నష్టం వాటిల్లింది. పెట్టుబడి నష్టపోయామని, ప్రభుత్వం సత్వరం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎకరాకు రూ.50 వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు. వరద నీరు నిలిచిపోవడంతో పాటు, వర్షాలు ఏకధాటిగా పడుతుండడంతో పూర్తిగా నష్టపోయాం. మరోసారి తోటలు వేసుకోవలసి వస్తుంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– దాసిరెడ్డి వెంకట సుబ్రహ్మణ్యం, సిద్ధాంతం

రక్తదానం సామాజిక బాధ్యత


రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, కళాశాల యాజమాన్యం

పాలకొల్లు సెంట్రల్: రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని ఛాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ కేవీఆర్ నరసింహరావు అన్నారు. గురువారం స్థానిక ఛాంబర్ కళాశాలలో జీఎస్టీ డిపార్ట్‌మెంట్, రెడ్‌క్రాస్ సొసైటీ, నరసాపురం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ నరసింహరావు మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన మరొకరికి ప్రాణదానం చేయడమే కాకుండా ఒక కుటుంబానికి అండగా నిలబడుతున్నామనే మానసిక ఆనందం ఎంతో ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చన్నారు. దీంతో సామాజిక సేవా దృక్పథానికి, శ్రేయస్సుకు మార్గ నిర్దేశకులు అవుతారన్నారు. 36 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. పోలియో డ్రాప్స్ నిమిత్తం రోటరీ క్లబ్ సభ్యులకు రూ.15 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.రాంబాబు, అధ్యాపకులు వై.ఆది త్య, రాజ భూషణం, జానకి రామయ్య, రోటరీ క్లబ్ సభ్యులు చవ్వాకుల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు


అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు: రామాలయ వీధిలో వేంచేసి యున్న షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు పెత్తఎత్తున తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. అనంతరం భీమవరానికి చెందిన బాబా భక్తులు కోరసిక రఘురాం జ్ఞాపకార్థం కోరసిక కోటేశ్వరరావు, వెంకట సత్య చక్రవర్తి, మౌనిక దంపతులు ఏర్పాటు చేసిన బాబా ప్రసాద వితరణలో ఆలయానికి వచ్చిన భక్తులు బాబా ప్రసాదాన్ని స్వీకరించారు.

మునిగిన కనకాయలంక కాజ్ వే


మునిగిన కాజ్ వే మీద ప్రయాణిస్తున్న గ్రామస్తులు

యలమంచిలి: కనకాయలంక గ్రామ ప్రజలను వరద వీడడం లేదు. గోదావరి ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల వలన గోదావరిలో వరద నీరు పెరగడంతో కనకాయలంక వద్ద కాజ్‌వే గురువారం మళ్లీ వరద నీరు చేరుకుంది. గత నెల 22న వరద ముంపునకు గురైన కాజ్‌వే సుమారు 18 రోజులు ముంపులోనే ఉంది. బుధవారం వరద నీరు తగ్గడంతో కాజ్‌వే బయటపడింది. అయితే గురువారం ఉద యం మళ్లీ వరద పెరగడంతో కాజ్ వే మీద కేవలం ఒకడుగు నీరుచేరింది. దీంతో కనకాయ లంక ప్రజలు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు.

ఆదమరిస్తే.. గోతిలోనే


పైన మూతలు లేకుండా బస్టాండ్ వద్ద ప్రమాదకరంగా ఉన్న డ్రెయిన్

నరసాపురం: స్థానిక బస్టాండ్ వద్ద డ్రెయిన్ ప్రమాదకరంగా ఉంది. డ్రెయిన్‌పై మూతలు లేవు. నిత్యం వేలాది మంది ఈ మార్గం గుండా ప్రయాణిస్తారు. అలాంటి ఈ మార్గంలో పరిస్థితి ఇంత ప్రమాదకరంగా ఉన్నా కూడా, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇటీవల బస్టాండ్ పక్కన డ్రెయిన్‌ను బాగు చేసి, మూతలు తీశారు. పని పూర్తైన తరువాత, తిరిగి మూతలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. డ్రెయిన్‌పై మూతలు లేకపోవడంతో అనేక మంది, గోతుల్లో పడి కాళ్లు, చేతులు విరగొట్టుకుంటున్నారు. అసలే ఈ డ్రెయిన్ పూర్తిగా శిథిలమైంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

చట్టాలపై అవగాహన తప్పనిసరి


సదస్సులో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

పాలకొల్లు సెంట్రల్: చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది అనంతలక్ష్మి సత్యవతి అన్నారు. గురువారం స్థానిక పెదగరువు ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నిల్లా సురేష్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలనే ఉద్దేశ్యంతో సుప్రీంకోర్టు న్యాయ సేవాధికార సంస్థలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ వరి విత్తనాల పంపిణీ


రైతులకు సబ్సిడీ విత్తనాలు సరఫరా చేస్తున్న దృశ్యం

యలమంచిలి: మేడపాడులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు నష్టపోయిన రైతులకు గురువారం సబ్సిడీ వరి విత్తనాలు పంపిణీ చేశారు. 10 మంది రైతులకు మూడు క్వింటాళ్ల విత్తనాలు అందజేశారు. మేడపాడుకు 43 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని ఇంకా అవసరమైన రైతులుంటే సంబంధిత గ్రామ రైతు సేవా కేంద్రంలో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు 30కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.227 చెల్లించి తీసుకెళ్లాలని ఆమె కోరారు. ఎంపీటీసీ డేగల సూర్యప్రభ, బోనం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు, బొప్పన హరి కిషోర్, పీతల శ్రీను గ్రామ వ్యవసాయ సహాయకురాలు కె.నాగలక్ష్మి, పాల్గొన్నారు.

పిల్లల బడికి పెద్దల ఎన్నిక

సజావుగా స్కూలు కమిటీ ఎన్నికలు


తూర్పుతాళ్లులో ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు పశాంతంగా ముగిశాయి. నరసాపురం మండలంలోని 124, మొగల్తూరు మండలంలో 84 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం స్కూల్స్‌లోని అన్ని తరగతులకు ఎంపికైన సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులందరిచే పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. తూర్పుతాళ్లు గ్రామంలోని పాఠశాల కమిటీ ఎన్నికల కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి–2 జాన్ ప్రభాకర్ మాట్లాడుతూ ఎంపికైన సభ్యులంతా కలసి ఆయా స్కూళ్లలోని మౌలిక వసతుల కల్పనలో పాలు పంచుకుంటారని తెలిపారు.

యాజమాన్య కమిటీల ఎన్నిక

పెనుగొండ: నియోజకవర్గంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం నూతన యాజమాన్య కమిటీలను ఎన్నుకొన్నారు. ఉదయం నుంచి కోలాహలంగా పాఠశాలలు నిండిపోయాయి. నూతన కమిటీలను ఎన్నుకున్న అనంతరం అభినందనలు నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధికి పాటు పడతామని నూతన యాజమాన్య కమిటీలు ప్రకటించాయి.

యాజమాన్య కమిటీల్లో నాయకుల జోక్యం

గురువారం నిర్వహించిన యాజమాన్య కమిటీ ఎన్నికల్లో రాజకీయ నాయకుల జోక్యం ఎక్కువగా ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో యాజమాన్య కమిటీలు పారదర్శకంగా ఎన్నుకొన్నారని తెలిపారు. ఇపుడు కొత్తగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లోనూ రాజకీయం కనిపించిందన్నారు. పాఠశాలల అభివృద్ధిపై రాజకీయ జోక్యం లేకుండా చూడాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రశాంతంగా యాజమాన్య కమిటీ ఎన్నికలు

పాలకొల్లు అర్బన్: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు పట్టణ, మండలాల్లోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో గురువారం ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 94 పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ ఎన్నికలు రాజకీయాలకు అతీతంగా నిర్వహించినట్లు ఎంఈవో ఆర్ఎస్‌వీఎస్ గంగాధర శర్మ విలేకరులకు తెలిపారు. హెచ్ఎం పి.భాగ్యలక్ష్మి, పి.సత్యనారాయణరాజు, ఎన్.ఆదినారాయణ, వి.మురళీకృష్ణంరాజు, కె.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఎంపికైన సభ్యుల్లో చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. అనంతరం స్థానిక రేపాక వారి సత్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్, ఉపాధ్యాయులు చంద్రకళ, బొక్కా భవానీ దుర్గ, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఎన్నికలు నిర్వహిస్తున్న ఎంఈవో ఆర్ఎస్‌వీఎస్ గంగాధర శర్మ


వెలగలేరులో రోడ్డుపై బైటాయించిన ఎంపీపీ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు

రోడ్డుపై బైఠాయించిన తల్లిదండ్రులు

పెనుమంట్ర: మండలంలోని ఏడు జెడ్పీ ఉన్నత పాఠశాలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలల్లో, 32 ప్రాథమిక పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు నిర్వహించారు. వెలగలేరులోని ఎంపీపీ పాఠశాలలో కొన్ని నాటకీయ పరిణామాలు చోటు చేసుకోవడంతో గందరగోళం ఏర్పడింది. ఈ పాఠశాలలో 37 మంది విద్యార్థులు ఉండగా 15 మంది తల్లిదండ్రులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అయితే ఇదే పాఠశాలలో పేరెంట్స్‌గా ఉన్న కొందరికి అధిక సంతానం కారణంగా సభ్యులుగా అవకాశం కల్పించలేదు. దీంతో తమకు సభ్యులుగా అవకాశం కల్పించాలని రోడ్డుపై తమ పిల్లలతో కలిసి ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు, గ్రామ పెద్దల జోక్యంతో ధర్నా విరమించినట్లు తెలిపారు.

క్రమ శిక్షణతోనే విజయాలు


సమావేశంలో మాట్లాడుతున్న సీబీఐ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ

నరసాపురం: చిన్న తనం నుంచి క్రమశిక్షణ కలిగి ఉంటే విజయాలు సాధించొచ్చని సీబీఐ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. వైఎన్ కళాశాలలో గురువారం కళాశాల హెచ్ఆర్డీ సెంటర్, ఐక్యూ ఏసీ సంయుక్త ఆధ్వర్యంలో క్రమశిక్షణతో మెరుగైన భవిష్యత్ నిర్మాణం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థి భవిష్యత్ నిర్మాణానికి ముఖ్యంగా కావాల్సింది క్రమశిక్షణ అని అన్నారు. జీవితాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నా, పది మందిని ప్రభావితం చేయాలన్నా, భవిష్యత్‌లో విజయాలు సాధించాలన్నా క్రమశిక్షణ అలవర్చుకోవాలని చెప్పారు. ప్రస్తుతం యువత సెల్‌ఫోన్ ఒకటే లోకమనే ధోరణిలో విలువైన సమయాన్ని వృధా చేసుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, డీన్ గంధం రామకృష్ణ, హెచ్ఆర్డీ డైరెక్టర్ చినిమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొగల్తూరులో న్యాయ విజ్ఞాన సదస్సు


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది చల్లా దానయ్య నాయుడు

నరసాపురం రూరల్: న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని ముద్దాయిలకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే సౌకర్యం ఉందని సీనియర్ న్యాయవాది చల్లా దానయ్య నాయుడు అన్నారు. గురువారం మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాబ్జీ అధ్యక్షతన మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా దానయ్య నాయుడు మాట్లాడుతూ వితంతు పింఛన్లు, మానసిక, అంగ వైకల్యం కలిగిన వారికి మండల న్యాయ సేవా సంస్థ ద్వారా అవసరమైన న్యాయ సహాయం పొందవచ్చన్నారు. మొగల్తూరు సీడీపీవో ఊర్మిళ మాట్లాడుతూ పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ముఖ్యంగా మగ పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తుండాలన్నారు. లీగల్ సర్వీసెస్ సభ్యులు దేవేంద్ర ఫణికర్, వై.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యం


తల్లులకు రేషన్ అందజేస్తున్న సర్పంచ్ అనిశెట్టి మల్లిక


తల్లిపాల వారోత్సవాల అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: ప్రతీ మహిళ తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని, తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యమని కాంబొట్లపాలెం సర్పంచ్ అనిశెట్టి మల్లిక కోరారు. తల్లిపాల వారోత్సవాలు, మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమం సందర్భంగా గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి బిడ్డకు పాలివ్వడం వలన వారిద్దరి మధ్య అనుబంధం పెరగడమే కాకుండా, ఇద్దరి ఆరోగ్యానికి మేలు చేకూరుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రతీ మహిళ తెలుసుకోవాలని ఆమె కోరారు. ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీవో పి.నాగరత్నం, స్థానిక గ్రామ పెద్దలు వాసంశెట్టి కేశవరావు, అనిశెట్టి వీరాంజనేయులు, అనిశెట్టి ప్రసాద్, ఎంఎస్‌కేఎం నాగలక్ష్మి అంగన్‌వాడీ టీచర్లు కె.యమున, పి.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం

పాలకొల్లు అర్బన్: పుట్టిన పసిబిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టించడం వలన బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి చెప్పారు. భగ్గేశ్వరం అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు తల్లి పాల వారోత్సవాల ముగింపు అవగాహన సదస్సు గురువారం సూపర్‌వైజర్ సత్యవేణి అధ్యక్షతన నిర్వహించారు. సదస్సులో తల్లులకు, గర్భిణులకు మిషన్ శక్తి 100 కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువులు తూకం వేశారు. బరువు తక్కువ, అలాగే రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కిషోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ సత్తార్ బీబీ, డి.వెంకట రమణ, కె.రాధ, ఎం.సుబ్బలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సేవాభావంతో మెలగాలి

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడాల గోపి


స్వీటు షాపుని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: లాభాపేక్షతో కాకుండా వినియోగదారులకు సేవాభావంతో నిర్వహించే వ్యాపారాలు వృద్ధి చెందుతాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు అన్నారు. పాలకొల్లు బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ మాజీ కౌన్సిలర్ కొత్రగింజల శ్రీనివాసరావు పునఃప్రారంభించిన స్వీటు స్టాల్‌ను గురువారం గోపి ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

మొగల్తూరు: 132 కేవీ కాకినాడ–రామచంద్రపురం ఫీడర్‌లో మరమ్మతు పనుల కారణంగా నరసాపురం సబ్ స్టేషన్‌పై ఉన్న లోడ్ సర్దుబాటు కారణంగా పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ బి.సురేష్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నరసాపురం సబ్ డివిజన్ పరిధిలోని కేపీపాలెం, కొప్పర్రు, మంగళగుంటపాలెం, పంజా సెంటర్, పీఎం లంక, సీతారాంపురం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, కావునా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యలమంచిలి: నరసాపురం నుంచి కాజ, యలమంచిలి, ఇలపకుర్రు విద్యుత్ సబ్ స్టేషన్స్ వచ్చే 33 కేవీ లైన్ల మరమ్మతులు, విద్యుత్ తీగల మీదకు వచ్చిన చెట్ల ఆకులు నరుకుతున్న కారణంగా విద్యుత్ నిలుపుదల కానుంది. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ మూడు విద్యుత్ సబ్ స్టేషన్స్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫర ఉండదని విద్యుత్ శాఖ నరసాపురం డివిజనల్ ఇంజనీర్ బి సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పాలకొల్లు సెంట్రల్: నరసాపురం నుంచి వచ్చే 33 కేవీ లైన్ మరమ్మతుల నిమిత్తం పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ బి సురేష్‌కుమార్ తెలిపారు. అలాగే పట్టణంలో 11కేవీ లైన్ మరమ్మతుల నిమిత్తం అడవిపాలెం సబ్‌స్టేషన్, పాలకొల్లు ఇన్‌డోర్ సబ్ స్టేషన్, ఏపీ టిడ్కో సబ్ స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ లైన్ పనులు చేయనున్నామన్నారు. ఈ సందర్భంగా ఉదయం 8.00గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామన్నారు. పట్టణంలో కోడిగట్టు, మార్కుపేట, రామయ్య హాల్, యాళ్లవాని గరువు, బ్రాడీపేట బైపాస్ రోడ్డు, పెనుమదం రోడ్డు, లక్ష్మీనగర్, బంగారు వారి చెరువుగట్టు, శంభునిపేట, మెయిన్‌రోడ్డు, వరిధనం రోడ్, సుబ్బారాయుడు గుడి సెంటర్, వెంకటేశ్వర కాలనీ, పెద్దపోస్టాఫీస్ ఏరియా, మావుళ్లమ్మపేట, క్రిస్టియన్‌పేట, నాగరాజు పేట, శాంతి నగర్, బిఆర్ఎంవి స్కూల్, లాక్ సెంటర్, రామారావు పేట, జోగయ్య కాలనీ, సోమేశ్వర అగ్రహారం, హౌసింగ్ బోర్డు కాలనీ, భీమవరం రోడ్డు, ఎల్అండ్‌టీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు.

చేనేత కార్మికులకు రాయితీపై హర్షం

పాలకొల్లు సెంట్రల్: చేనేత దినోత్సవం పురస్కరించుకుని చేనేతకార్మికులకు అనేక వరాలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు వట్టం గణేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక వీవర్స్ కమ్యూనిటీ హాలు నందు సమావేశం ఏర్పాటుచేసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గణేశ్వరరావు మాట్లాడుతూ జీఎస్టీని తగ్గించే విధంగా కృషి చేస్తామని లేదంటే కట్టిన జీఎస్టీని తిరిగి చెల్లిస్తామని చెప్పడం హర్షణీయమన్నారు. త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద రాష్ట్ర ప్రభు త్వం ఇచ్చే వాటాను 8 శాతం నుంచి 16 శాతానికి పెంచుతామని ఇందుకు సుమారు రూ.10 కోట్లు వెచ్చిస్తామని తెలిపారన్నారు. ఇళ్లల్లో మగ్గం పెట్టుకునే వారికి అక్కడే మగ్గం ఏర్పాటు చేసుకునే విధంగా సహకారం అందిస్తామని ఒకవేళ ఇంటిలో మగ్గం పెట్టుకునే వెసులుబాటు లేకపోతే ఆయా ప్రాంతాల్లో 5 ఎకరాల భూమి తీసుకొని సామూహిక మగ్గాల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పడం హర్షణీయమన్నారు. గృహ నిర్మాణం కింద రూ.4.30 లక్షలు ఇస్తామని అలా గే చేనేత కార్మికులు మగ్గం ఏర్పాటు చేసుకోవడానికి రూ.50వేలు అదనంగా అందిస్తామని చెప్ప డం చేనేత కార్మికులకు మంచి రోజులు వచ్చాయన్నారు. ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కార్యదర్శి నీలంశెట్టి సత్య ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జంతర్ మంతర్ వద్ద మాల మహానాడు నిరసన

పెనుగొండ: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరసన వ్యక్తం చేసినట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ తెలిపారు. గురువారం ఢిల్లీ నుంచి మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో పిటీషన్ వేశామన్నారు.

నరసాపురం తహసీల్దార్‌గా రాజరాజేశ్వరి


తహసీల్దార్ రాజరాజేశ్వరిని అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నరసాపురం తహసీల్దార్‌గా తలారి రాజరాజేశ్వరి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకురాలిగా విధులు నిర్వహించడంతోపాటు పోడూరు, ఇరగవరం, పెరవలి మండలాల తహసీల్దార్‌గా పని చేశారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను డీటీలు బెజవాడ సీతారత్నం, కట్టా నాగదేవి, నందేటి నిర్మల జ్యోతి, ఆర్ఐ కవురు యశోద, వీఆర్వోలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది, వీఆర్ఏలు కలిశారు.

ట్రస్టు సేవలు అభినందనీయం

పెనుగొండ: బీవీ రమణ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అమోఘమని, ప్రతీ ఒక్కరూ అభినందించాలని భీమవరం ఓల్డ్ ఏజ్ హోం ఫౌండర్ నిమ్మలూరి లక్ష్మీనారాయణ రాజు అన్నారు. ములపర్రులో బీవీ రమణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కైలాస రథం, హెల్పింగ్ మోటారు సైకిల్, ఫ్రీజర్ బాక్స్‌లను ప్రారంభించారు. చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బీవీ రమణ మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలోని మెగా వైద్య శిబిరంలో సుమారు 400 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. కమండూరి స్వామి నాథన్, కమంటూరి సీతారామన్, ఎస్ఎస్ రాజు, మన్నే రామ్మోహన్‌రావు, నెక్కంటి బుచ్చేశ్వరరావు, బొక్కా అరుణ పాల్గొన్నారు.